## ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన గోపాల మిత్రలు



కొడంగల్, జూలై 3 : గోపాల మిత్రలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయి, వేతనాలను విడుదల చేయడంపై గోపాల మిత్రలు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 23 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నామని, శాశ్వత ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని కోరినట్లు తెలిపారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గోపాల మిత్ర జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ రవీందర్‌తో పాటు గోపాలమిత్రలు మహేశ్, బందయ్య, బుచ్చిరెడ్డి, రఘురామ కృష్ణ, శివకుమార్, విశ్వనాథ్, దశరథం, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ధారూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ నారాయణరెడ్డి

ధారూరు పోలీసులకు సూచనలు, సలహాలు ఇస్తున్న వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి

ధారూరు, జూలై 3 : పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రికార్డులను అప్‌డేట్ చేసుకోవాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ధారూరు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పలు రికార్డులు, పోలీస్ స్టేషన్ అవరణను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఎస్పీ వెంట వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ధారూరు సీఐ రామకృష్ణ, ధారూరు ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## రైతుల సంక్షేమం కోసమే రైతు భరోసా

### రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి

సమావేశంలో మాట్లాడుతూన్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి

చేవెళ్లటౌన్, జూలై 3 : రైతుల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రైతుల భరోసా పథకాన్ని ప్రవేశపెట్టిందని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో బుధవారం సొసైటీ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలను సేకరించారు. కొందరు రైతులు 5 ఎకరాల వరకు మాత్రమే పంట పెట్టుబడి సాయం అందించాలని, మరి కొంత మంది 10 ఎకరాల లోపువారికి ఇవ్వాలని, సాగు చేసినా చేయకున్నా పది ఎకరాలకు ఇవ్వాలని భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు. కొందరు 5 ఎకరాల రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని, వాటితో పాటు సబ్సిడీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, డ్రిప్ పరికరాలు ఇవ్వాలని రైతులు తమ అభిప్రాయలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అభిప్రా యాల మేరకే ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేయనున్నదని చెప్పారు. రైతు భరోసా సాయం నిజమైన రైతులకు అందేలా ప్రభుత్వం పకడ్బందీగా ప్రణాళికలను రూపొందిస్తున్నదని తెలిపారు. వ్యవసాయం చేసే రైతులకు పంట పెట్టుబడి సాయమిచ్చి వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణరెడ్డి, ఏడీఏ రమాదేవి, వ్యవసాయ మండల అధికారి తులసి, మాజీ ఎంపీటీసీలు గుండాల రాములు, వసంతం, డైరెక్టర్లు పాటి దామోదర్ రెడ్డి, మధుసుదన్‌రెడ్డి, బండారి సువర్ణ, మద్దెల లక్ష్మమ్మ, అంజిరెడ్డి, నర్సింహులు, రాములు, శ్యామలయ్య, సీఈవో వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మగ్గం వర్కులో మహిళలకు శిక్షణ

ఇబ్రహీంపట్నం, జూలై 3 : ఇబ్రహీంపట్నం, మంచాల,యాచారం మండలాల్లోని గ్రామీణ ప్రాంత మహిళలకు ఉన్నతి పథకం కింద ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీఆర్డీఏ జిల్లా అధికారి శ్రీలత తెలిపారు. 19 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల లోపు మహిళలు ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న మహిళలకు 30 రోజుల పాటు మగ్గం వర్కుపై ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో ఉపాధి హామీ పథకం ద్వారా రోజుకు రూ.300 చొప్పున చెల్లించడంతో పాటు భోజనం, యూనీఫాం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తైన వారికి ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తామన్నారు. దరఖాస్తు చేసుకునేవారు ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పనిదినాలు పూర్తి చేసి ఉండాలని, పదోతరగతి చదివి ఉండాలన్నారు. ఆసక్తి గల మహిళలు ఆయా మండలాల్లోని ఏపీవోలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## జాతీయ ఉపాధ్యాయ అవార్డు కోసం దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, జూలై 3 : ఉపాధ్యాయులకు జాతీయ ఉపాధ్యాయ అవార్డు ఎంపిక చేసేందుకు గాను సంబంధిత ఉపాధ్యాయుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవార్డుకు గాను రిజిస్ట్రేషన్లను వ్యక్తిగత ఆన్‌లైన్ దరఖాస్తులను http://nationalawardstoteachers.education.gov.in పోర్టల్ ద్వారా 15-07-2024 వరకు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేయబడిన ప్రింట్ కాపీని, అనుబంధ సంబంధిత ప్రతులను జత చేసి మూడు సెట్లను జిల్లా విద్యాశాఖ అధికారి, రంగారెడ్డి జిల్లా, కొంగరకలాన్‌కు సంబంధిత పర్యవేక్షణ అధికారి ద్వారా 15-07-2024 వరకు సమర్పించాలని సూచించారు.

## డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు లక్కీ డ్రా

షాద్‌నగర్‌టౌన్, జూలై 3 : టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో షాద్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్లే డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు లక్కీ డ్రా బాక్స్‌ను ఏర్పాటు చేస్తునట్లు షాద్‌నగర్ ఆర్టీసీ డీఎం ఉష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలు తమ టికెట్‌పై తమ పేరు, సెల్ నంబర్‌ను రాసి డ్రైవర్ వెనుకాల ఉన్న లక్కీ బాక్స్‌లో వేయాలన్నారు. ఈ లక్కీ డ్రా ను 15రోజులకు ఒక సారి తీయడం జరుగుతుందని, లక్కీ డ్రాలో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. లక్కీ డ్రా సెప్టెంబర్ 30వరకు ఉంటుందని, ఈ అవకాశాన్ని మహిళా ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పదవులకే కానీ.. ప్రజాసేవకు విరమణ లేదు

- కార్యకర్తలకు అండగా ఉంటా..
- వచ్చే ఎన్నికల్లో ఏపీలో జగన్ ఎదుర్కొన్నట్లుగా రేవంత్‌కు తప్పదు..
- ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలి..
- ఎమ్మెల్సీ గెలుపు.. బీఆర్ఎస్ పూర్వ వైభవానికి నాంది..
- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానించిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, జూలై 3 : ప్రజాప్రతినిధులకు పదవులకే కానీ.. ప్రజాసేవకు విరమణ ఉండదని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మంజునాథ బ్లాంకెట్ హాల్‌లో ఎమ్మెల్సీని సన్మానించడంతో పాటు పదవీకాలం ముగిస్తున్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పూర్వవైభవం వస్తుందనేందుకు ఎమ్మెల్సీ ఎన్నికే నిదర్శనమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో గెలువడం బీఆర్ఎస్ శ్రేణుల ఘన విజయంగా పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల్లో సీఎం సిట్టింగ్ స్థానం మల్కాజ్‌గిరి, సొంత జిల్లా మహబూబ్‌నగర్, ఇన్‌చార్జిగా ఉన్న చేవెళ్ల వంటి మూడు స్థానాల్లో కాంగ్రెస్ ఓటమి పాలు కావడం రేవంత్ పాలనపై ప్రజలకు విసుగుపుట్టడమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 8నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని, ఇప్పుడే ధైర్యంగా ఉండి ప్రజలకు సేవ చేయాలన్నారు. ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదని స్పష్టం చేశారు. కొడంగల్ నియోకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి అధిక మెజార్టీ రావడంపై కేసీఆర్, కేటీఆర్‌లు ప్రత్యేకంగా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అభినందించినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీఎం నియోజకవర్గం అయినప్పటికీ బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందడం చాలా గర్వంగా ఉన్నదన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీకి వెన్నంటి ఉన్నారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో సంక్షేమం కుంటుపడిందన్నారు. కాబట్టే గడిచిన 8 నెలల్లో 15సార్లు సీఎం ఢిల్లీకి వెళ్లివచ్చారన్నారు. ఏపీలో చంద్రబాబు సీఎంగా వచ్చిన అనతి కాలంలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ పెంచడంతో పాటు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇచ్చారని, ఏపీ సీఎంను చూసి తెలంగాణ సీఎం సిగ్గుపడాలని ఎద్దేవ చేశారు. రైతుభరోసాను పెంచాలని, ఇచ్చినమాట నిలబెట్టుకోవాలన్నారు. నిరుద్యోగ సమస్యను తీరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేటికి ఆ ఊసే ఎత్తడంలేదని ఆరోపించారు. గతంలో కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు సంబంధించి ధ్రువత్రాలను అందించి మేము ఇస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సీఎం అన్న తిరుపతిరెడ్డి ఎటువంటి అధికారం లేనప్పటికీ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, ఇక ముందు ఇదేవిధంగా జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. సీఎం నియోజకవర్గం కాబట్టి కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉన్నా ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం కాంగ్రెస్ నాయకుల సంతకం కావాలని అధికారులు ఇబ్బంది పెట్టడం సబబు కాదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఏపీలో జగన్ దుస్థితి పట్టక తప్పదని హితవు పలికారు. అనంతరం పదవీ కాలం ముగిస్తున్న ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీ తదితరులకు మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఘనంగా సన్మానించారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసమస్యలపై పోరాటం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్యాసం రామకృష్ణ, చాంద్ పాషా, సలీం, కోట్ల యాదగిరి, కోట్ల మహిపాల్, నారాయణరెడ్డి, నరోత్తం రెడ్డి, హెమీబాయి, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, దేశ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

### భారతీయ కిసాన్ సంఘ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గడిగే గజేందర్‌గౌడ్

షాబాద్ మండలం ఉబ్బ గుంటలో రైతులతో మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు గడిగే గజేందర్‌గౌడ్

షాబాద్, జూలై 3 : విద్యుత్తు ప్రమాదాలపై రైతాంగం అప్రమత్తంగా ఉండాలని భారతీయ కిసాన్ సంఘ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గడిగే గజేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని ఉబ్బగుంట గ్రామానికి చెందిన మోత్కూరి సాయన్న కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. రైతు సాయన్నకు చెందిన రెండు పాడి గేదెలు ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందడంతో ఉపాధిని కోల్పోయారన్నారు. ప్రభుత్వం తక్షణసాయంగా రూ.40వేలు ప్రతి పశువుకు ఇస్తుందని, దానికోసం కావాల్సిన పత్రాలను విద్యుత్తు శాఖ అధికారులకు అందించాలని సూచించారు. ప్రమాదకరంగా వేలాడుతున్న వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులను రైతులు ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదని, అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట సంఘం మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, మండల కార్యవర్గసభ్యులు ఓగ్గు మల్లయ్య, చంద్రబాబు తదితరులుఉన్నారు.

## నాణ్యమైన వైద్యం అందించాలి

### ప్రైవేటు దవాఖానలను తనిఖీ చేసిన జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు

ఏబీవీ దవాఖాన నిర్వాహకులు, డాక్టర్లతో మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు

షాద్‌నగర్‌టౌన్, జూలై 3 : వైద్యం కోసం ప్రైవేటు దవాఖానకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు వైద్యులకు సూచించారు. పట్టణంలోని ఏబీవీ, బుగ్గారెడ్డి దవాఖానలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానల రిజిస్ట్రేషన్, రికార్డులను, వైద్యుల సరిఫికెట్లను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. దవాఖానలోని ఆపరేషన్ థియేటర్లు, లేబర్ రూమ్స్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే దవాఖానను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్, చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, దామోదర్, జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ శ్రీనివాసులు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ శ్రీహరి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డీఎంఎం, హెచ్‌వోసీసీ సురేశ్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

### కలెక్టర్ శశాంకకు వినతి పత్రాన్ని అందజేసిన సీఐటీయూ యూనియన్ నాయకులు

సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ శశాంకకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్

రంగారెడ్డి, జూలై 3 (నమస్తే తెలంగాణ) : 65 సంవత్సరాలు పూర్తయిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్లను జూలై 24 తర్వాత ఇంటికి పంపించే ప్రయత్నం చేస్తున్నదని, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ బుధవారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తోపాటు ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ శశాంకు వినతిపత్రాన్ని అందజేశారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యం పెట్టుకుని విద్యనభ్యసించాలి

చిలుకూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న అర్చకులు రంగరాజన్

మొయినాబాద్, జూలై 3 : విద్యార్థులు ఉన్నత లక్ష్యం పెట్టుకుని విద్యను అభ్యసించాలని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం అర్చకులు రంగరాజన్ స్వయంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఎంతో నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని, వారు నాణ్యమైన విద్యా బోధన అందిస్తారని తెలిపారు. విద్యార్థులు ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చే దిశగా చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఎందరో ఉన్నత శిఖరాలను అదిరోహించారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవచ్చన్నారు. సామాజిక బాధ్యత కింద ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో చదువున్న విద్యార్థుల విద్యను ప్రోత్సహించడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అర్చకుడి సహాయకులు పవన్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, రమాదేవి, రాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ కుల గణనపై సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదు

- ఉద్దేశపూర్వకంగానే బీసీ కులగణను అడ్డుకుంటున్నారు
- కోర్టు కేసుల పేరుతో కాలయాపన చేస్తున్నారు
- సీఎం రేవంత్‌రెడ్డి పనితీరును నిరసిస్తు ఈ నెల 15న సచివాలయం, పబ్లిక్ కమిషన్ కార్యాలయం ముట్టడి
- విలేకరుల సమావేశంలో బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్

షాద్‌నగర్ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతున్న బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్

షాద్‌నగర్, జూలై 3 : సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే బీసీల కుల గణనను ఆలస్యం చేస్తున్నారని బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డిలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ సభలో కర్ణాటక సీఎం సిద్దిరామయ్య చేత బీసీల కులగణన చేస్తామని చెప్పించిన అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ కుల గణనను పూర్తిగా విస్మరించారన్నారు. ఆరు నెలల్లో బీసీ కులాలపై సమగ్ర సర్వే నిర్వహించి 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని చెప్పిన సీఎం బీసీలపై కుట్ర పన్ని, బీసీల ఎదుగుదలను అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. బీసీ కులాలకు సంబంధం లేని వ్యక్తుల చేత కుల గణనపై కోర్టుల్లో కేసులు వేయించి పరోక్షంగా బీసీ గణనను అడ్డుకుంటున్నది నిజం కాదా ? అని ప్రశ్నించారు. కేంద్రంలో ఇండియా కూటమి అధినేత రాహుల్‌గాంధీ బీసీ కులాలపై ప్రతిపక్ష నేతగా మాట్లాడుతున్నారు కానీ, అదే రాష్ట్రంలో ఉన్న సీఎం బీసీల రిజర్వేషన్లపై ఎందుకు నోరుమెదుపడం లేదన్నారు. బీసీలకు అన్యాయం చేస్తే సీఎంకు ఏం ప్రయోజనమో చెప్పాలన్నారు. బీసీ డిక్లరేషన్‌ను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం నిరుద్యోగ సమస్యలైనా పట్టించుకోవడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే గత ప్రభుత్వంలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేసి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలతో కలిసి ఆర్టీసీ క్రాస్ రోడ్డులో 2 లక్షల ఉద్యోగాలు వేస్తామని ప్రకటించినా, నేటికి ఆ ఊసే లేదన్నారు. కనీసం గ్రూప్-2, గ్రూప్-1 ఉద్యోగాల సంఖ్యనైనా పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నేడు నిరుద్యోగులు, యువకులు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పనితీరును తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారన్నారు. అప్పటి సీఎం కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధి కోసం నీళ్లు, నిధులు కేటాయిస్తే నేటి సీఎం కనీసం నిరుద్యోగుల సమస్యలను కూడా పట్టించుకోవడం లేదనే భావనలో ఉన్నారని పేర్కొన్నారు. బీసీ కులగణన, డిక్లరేషన్ అమలు ఆలస్యాన్ని, ఉద్యోగ నియామకాల ప్రకటనపై నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 15న రాష్ట్ర సచివాలయాన్ని, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాలను ముట్టడిస్తున్నామని, ఈ నిరసన కార్యక్రమాలకు అన్ని వర్గాల నిరుద్యోగులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, పలు పార్టీల నాయకులు మద్దతు తెలుపుతున్నారని అన్నారు. సచివాలయ ముట్టడి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని జిల్లాల నుంచి నిరుద్యోగులు, బీసీ కులాల ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార సంఘాల కార్పోరేషన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్, జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ, బీసీ అడ్వకేట్ జేఏసీ నాయకుడు గోవర్ధన్‌లు పాల్గొన్నారు.

## పేదలకు ఇండ్లను పంచమంటే విమర్శలా ?

### డబుల్ బెడ్రూం ఇండ్లపై రాజకీయాలు ఎందుకు ?

### వ్యక్తిగతంగా విమర్శిస్తే కాంగ్రెస్ నాయకుల బండారం బయటపెడుతా..

### రాష్ట్ర సహకార సంఘాల కార్పోరేషన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్

ప్రభుత్వ నిబ్బంధనల ప్రకారం డబుల్ బెడ్రూం నివాసాలను అర్హత కలిగిన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సూచిస్తే అర్థం లేని విమర్శలు చేస్తూ రాజకీయాలు చేయడం కాంగ్రెస్ నాయకులకు సరి కాదని రాష్ట్ర సహకార సంఘాల కార్పోరేషన్ మాజీ చైర్మన్ రాజావర ప్రసాద్ మండిపడ్డారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రూ.వంద కోట్ల నిధులను వెచ్చించి డబుల్ బెడ్రూంలను నిర్మిస్తే నేటి ప్రభుత్వం ఆ ఇండ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అర్హుల ఎంపిక భారం కాదనే విషయాన్ని ఆ పార్టీల నాయకులు గ్రహించాలని, కేవలం తమ స్వార్థ రాజకీయాల కోసం తాపత్రేయపడుతున్నారే తప్పా పేదల ఇబ్బందులను గుర్తించడం లేదని అన్నారు. ఇండ్ల స్థలాలను కబ్జాలు చేసిన నాయకులు, రియల్ వెంచర్లలో వస్తువులను చోరీ చేసిన నాయకులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి చెప్పుదెబ్బలు తిన్న నేతలు రాష్ట్ర సాధనలో భాగస్వాములైన ఉద్యమకారులు, నాయకులపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. అధికారంలో ఉన్నామనే విషయాన్ని మర్చి కేవలం మీడియా ప్రచారం కోసం పాకులాడే నేతలకు ప్రజల సమస్యలను పట్టించుకునే సోయి ఉన్నదా ? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా విమర్శలు చేయడం మానుకుని ప్రజా సమస్యలపై దృష్టిసారించాలని హితవు పలికారు.